క్లుప్తంగా

వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలు

మదనపల్లె: మున్సిపాలిటీ పరిధిలోని 44 వార్డు సచివాలయాలకు చెందిన 354 మంది ఉద్యోగుల బదిలీలకు కౌన్సిలింగ్ శుక్రవారం చిత్తూరులో మొదలైందని కమిషనర్ కే.ప్రమీల తెలిపారు. ఐదేళ్లు పైబడిన, ఇతరా నిబంధనల మేరకు ఉద్యోగుల బదిలీలు ఉంటాయని, ఇందులో మున్సిపల్‌శాఖకు సంబంధించి 176 మంది ఉద్యోగులు ఉన్నట్లు చెప్పారు. శనివారం కూడా బదిలీల ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.

మదనపల్లె ఏడీఏగా ఆర్.రమేష్



ఏడీఏగా బాధ్యతలు స్వీకరిస్తున్న రమేష్‌కు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

మదనపల్లె రూరల్ :వ్యవసాయశాఖ, మదనపల్లె డివిజన్ ఏడీఏగా ఆర్.రమేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరుజిల్లా పుత్తూరు ర్యెగులర్ ఏడీఏగా పనిచేస్తున్న రమేష్..సాధారణ బదిలీల్లో భాగంగా మదనపల్లెకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం మదనపల్లె ఏడీఏగా పనిచేస్తున్న శివశంకర్ రాజంపేటకు బదిలీ కాగా, ఆయన స్థానంలో ఆర్.రమేష్ విధుల్లో చేరారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఏడీఏ రమేష్ మాట్లాడుతూ...మదనపల్లె డివిజన్‌లోని 8 మండలాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. గతంలో నగరి, రైల్వేకోడూరులో ఏడీఏగా, విజయపురం, పిచ్చాటూరు, నింద్ర, నగరి, నారాయణవనంలో ఏఓగా బాధ్యతలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ ఉద్యోగులు.. పూర్వ ఏడీఏ శివశంకర్‌కు వీడ్కోలు తెలుపుతూ, నూతన ఏడీఏ రమేష్‌కు స్వాగతం పలికారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని పోతుపేట సమీపంలోని యంపార్లపల్లి మిట్ట వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. మండలంలోని తుమ్మరకుంట నుంచి బూర్లపల్లి వైపు నాగార్జున (30).నవీన్ (30)లు స్కూటీలో వెళుతుండగా బి.కొత్తకోట నుంచి టి.సదుం వైపు మరో ద్విచక్ర వాహనంలో వస్తున్న నాగరాజు (32) స్కూటీని ఢీకొన్నాడు. ఘటనలో నాగార్జున తలకు బలమైన గాయం కాగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. మద్యం మత్తులో నాగరాజు వేగంగా వచ్చి స్కూటీని ఢీకొన్నట్లు పోలీసులు తెలిపారు.

మెగా జాబ్‌మేళాకు స్పందన

మదనపల్లె రూరల్ : ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో పట్టణంలోని విశ్వహిత డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. శుక్రవారం మెగా జాబ్ మేళాను ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రారంభించారు. యువత, ఉద్యోగాలకు కావాల్సిన నైపుణ్యాలను నేర్చుకుని మంచి ఉద్యోగాలు సాధించాలన్నారు. జాబ్‌మేళాకు సుమారు 400 మందికి పైగా అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. సుమారు 15 కంపెనీలకు పైగా ప్రతినిధులు జాబ్‌మేళాలో పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించి, 198 మంది నిరుద్యోగులను వివిధ ఉద్యోగాల కోసం ఎంపిక చేసుకున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన నిరుద్యోగులకు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి దాసరి నాగార్జున, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా మురుగు నీటి కాలువ నిర్మాణ పనులు

పీలేరురూరల్ : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఎల్‌బీఎస్ రోడ్డులో మురుగునీటి కాలువ నిర్మాణ పనులు చురుగ్గా చేపట్టారు. పది నెలల క్రితం కాలువ నిర్మాణానికి పంచాయతీ అధికారులు కాలువ తవ్వి అర్ధాంతరంగా వదిలేశారు. దీంతో వ్యాపారులు, ప్రయాణికులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఈ విషయాన్ని స్థానిక నాయకులు ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే సత్వరమే కాలువ నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. దీంతో శుక్రవారం కాలువకు కాంక్రీట్ వేయడానికి పనులు చురుగ్గా చేపట్టారు. ఎట్టకేలకు పనులు జరుగుతుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె సిటీ: విద్యార్థి దశ నుంచి నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. శుక్రవారం స్థానిక సొసైటీకాలనీలోని విజయభారతి పాఠశాలలో విద్యార్థి ఎన్నికల్లో గెలుపొందిన విజేతలకు మెమెంటోలు అందజేసి సత్కరించారు. ప్రతి ఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలన్నారు. పాఠశాలలో చదివిన విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉన్నారన్నారు. పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చల్లపల్లి నరసింహారెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ ఎస్.సేతు, ప్రిన్సిపాల్ నిశ్చిత సేతు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల పోరుబాట

సామూహిక సెలవు కోసం వినతి



నిమ్మనపల్లె: ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు



పీలేరులో వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

నిమ్మనపల్లె: గ్రామ పంచాయతీ కార్యదర్శులు పోరుబాట పట్టనున్నారు. తీవ్రమైన పని పని భారం, మానసిక ఒత్తిడితో సతమతమవుతున్నామని ఆవేద వ్యక్తం చేస్తున్నారు. ఈమేరకు సామూహిక సెలవు కోరుతూ శుక్రవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ పరమేశ్వర్ రెడ్డికి వినతి పత్రం అందించారు. మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుని శనివారం సామూహిక సెలవు కావాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...పంచాయతీ కార్యదర్శులు తీవ్రమైన పని పని భారం, మానసిక ఒత్తిడితో సతమతమవుతూ ఉద్యోగాల్లో కొనసాగుతున్నారన్నారు. ప్రభుత్వం అనేక రకాలుగా పంచాయతీ కార్యదర్శులపై అధిక భారాన్ని మోపుతోందన్నారు. తెల్లవారుజాము నుంచే విధులలో ఉండేలా ఒత్తిడి తేవడం, నిరంతర సమీక్షలు, జిల్లా రాజధానికి తరచూ వెళ్లి రావడం, తదితర సమస్యలతో పంచాయితీ కార్యదర్శులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తమ సమస్యలను జిల్లా కలెక్టర్ దష్టికి తీసుకు వెళ్లేందుకు, రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య ఆదేశాల మేరకు శనివారం సామూహిక సెలవు పెడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వెంకటరమణారెడ్డి, మారెప్ప, గౌతమి గాయత్రి, రాజేష్, సరస్వతి, మమత, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పీలేరురూరల్ : గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో లతీఫ్‌ఖాన్‌కు పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల సమైఖ్య పిలుపు మేరకు ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలపై శనివారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. శనివారం పంచాయతీ కార్యదర్శులు సామూహిక శెలవుపై వెళ్లుటకు నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు హరిప్రసాద్, అయ్యప్ప, నాగభూషణం, సిగ్బతుల్లా, ఫారుఖ్, జ్ఞానశేఖర్, గుణశేఖర్, సంయుక్త, వసంత, హిమబిందు, బావాజి తదితరులు పాల్గొన్నారు.

మూకుమ్మడిగా సెలవు కోసం వినతి

పెద్దమండ్యం: పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం మూకుమ్మడిగా సెలవు కోసం వినతి చేశారు. మండలంలోని గ్రామ పంచాయతీలలో గ్రేడ్ 1 నుండి 6 వరకు విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులు ఈ మేరకు ఎంపీడీవో శ్రీధర్‌రావుకు వినతి పత్రాన్ని అందజేశారు. శనివారం సామూహిక సెలవుపై వెళ్లేందుకు అనుమతించి సెలవు మంజూరు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె: గ్రామపంచాయతీ కార్యదర్శులు ఒక రోజు సామూహిక సెలవు కోసం శుక్రవారం ఇన్‌చార్జ్ ఎంపిడిఓ థామస్‌రాజాకు వినతిపత్రం అందజేశారు. గ్రామ పంచాయతీ క్షేత్రస్థాయిలో కార్యదర్శుల సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు శనివారం ఒక రోజు 16 మంది కార్యదర్శులకు సామూహిక సెలవు అనుమతించాలని వినతి పత్రంలో కోరారు.

పెద్దతిప్పసముద్రంలో..

పెద్దతిప్పసముద్రం: మండలంలోని అన్ని సచివాలయాల్లో పని చేస్తున్న 15 మంది పంచాయతీ కార్యదర్శులు సామూహిక శెలవులో వెళుతున్నామంటూ శుక్రవారం ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య పిలుపు మేరకు తాము ఎదుర్కొంటున్న సమస్యలు తదితర కారణాలతో శెలవులో వెళ్ళేందుకు అనుమతి కోరుతూ వినతి పత్రం అందజేశామన్నారు.

రామసముద్రంలో..

రామసముద్రం : రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య ఆదేశాల మేరకు శనివారం సామూహిక సెలవు పెడుతున్నట్లు పంచాయతీ కార్యదర్శులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీవో భాను ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు.



తంబళ్లపల్లె: ఎంపీడీఓ థామస్‌రాజాకు వినతిపత్రం,



పెద్దతిప్పసముద్రంలో..



పెద్దమండ్యంలో..

ఆకట్టుకుంటున్న చేనేత హస్తకళా ప్రదర్శన

మదనపల్లె రూరల్ : పట్టణంలోని పుంగనూరు రోడ్డు, మిషన్ కాంపౌండ్‌లో ఏర్పాటు చేసిన క్రాఫ్ట్ బజార్ చేనేత హస్తకళా ప్రదర్శన సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. జూన్ 25న ప్రారంభమైన ప్రదర్శనలో..నాణ్యమైన చేనేత వస్త్రాలు, హస్త కళాఖండాలు ఉత్పత్తిదారుల నుంచి నేరుగా వినియోగదారులకు సరమైన ధరలకు అందించేందుకు ఎగ్జిబిషన్‌ను ఏర్పాటుచేసినట్లు నిర్వాహకులు తెలిపారు. క్రాఫ్ట్ బజార్ చేనేత హస్త కళా ప్రదర్శనలో, కలంకారి చీరలు, వరంగల్ టవల్స్, కొండపల్లి బొమ్మలు, బెంగాల్ శారీస్, హైదరాబాద్ పెరల్స్, శారీస్, సహరన్‌పూర్ ఉడ్, లాకర్ వేర్స్, బొంబాయి ఫ్యాన్సీ జ్యువెలరీ ప్రత్యేకతలన్నారు. ఈ ప్రదర్శన ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు తెరచి ఉంటుందని, మదనపల్లె పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మహిళల రక్షణ కోసం శక్తియాప్

మదనపల్లె సిటీ: మహిళల రక్షణ కోసం శక్తి యాప్‌ను ప్రతి ఒక్కరూ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని మదనపల్లె తాలూకా ఎస్ఐ గాయిత్రి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో శక్తి యాప్, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలు, చిన్నారుల భద్రత,రక్షణ కోసం శక్తి యాప్ అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ యాప్ ఉంటే ఎల్లప్పుడూ ధైర్యం ఉండవచ్చునన్నారు. మహిళలు అత్యవసర పరిస్థితుల్లో పోలీసుస్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండానే ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చునన్నారు. డ్రగ్స్ వాడటం వల్ల ఎంతో మంది జీవితాలు బుగ్గిపాలవుతున్నాయన్నారు. వీటికి యువత దూరంగా ఉండాలన్నారు. బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ కృష్ణవేణి, అధ్యాపకులు జ్యోతి, వనజ పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఇంటింటికీ తీసుకెళ్లాలి



ప్రభుత్వ వైఫల్యాలపై వివరిస్తున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్

మదనపల్లె రూరల్ : కూటమిప్రభుత్వ వైఫల్యాలను ఇంటింటికీ తీసుకెళ్లి, ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన మోసాన్ని ప్రజలకు వివరించాలని నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ కోరారు. శుక్రవారం మండలంలోని కోళ్లబైలు అబూ హురేరా మసీదులో, స్థానికుల ఆహ్వానం మేరకు ప్రత్యేక ప్రార్థనల్లో నిసార్‌అహ్మద్ పాల్గొన్నారు. అనంతరం స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ...ఎన్నికల సందర్భంగా ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను కూటమిప్రభుత్వం విస్మరించి, పాలన గాలికి వదిలేసిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకు వచ్చే టీడీపీ నాయకులను ప్రజలే ఛీకొట్టే పరిస్థితి నేడు ఉందన్నారు. ఏడాది కూటమిపాలనలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలుచేయకపోగా, అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తూనే ఉన్నారన్నారు. కూటమిప్రభుత్వంలో రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని, ధరలు లేక మామిడి, టమాటా రైతులు తల్లడిల్లిపోతున్నారన్నారు. కష్టకాలంలో రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం, తనకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు భయపడాల్సిన పనిలేదని, ఏడాదికే కూటమిపాలనపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి రావడం, జగనన్న ముఖ్యమంత్రి కావడం, సంక్షేమపథకాలు అందరికీ అందుతాయన్నారు. జగన్ 2.0లో కార్యకర్తలకు పెద్దపీట ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఏఐటీయూసీ నిరసన ర్యాలీ జయప్రదం చేయండి

పీలేరు : కార్మికుల సమస్యలపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వచ్చే నెల 9న నిర్వహించనున్న నిరసన ర్యాలీని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నరసింహులు కోరారు. శుక్రవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం, రార్మికుల హక్కుల సాధనే లక్ష్యంగా నిరసన కార్యక్రమం తలపెట్టినట్లు తెలిపారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వచ్చే నెల 9న ఉదయం 10 గంటలకు పీలేరు పట్టణంలో నిరసన ర్యాలీ ఉంటుందని తెలిపారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్మిక నాయకులు యశోద, పి.వి. రమణ, మునిరత్నమ్మ, నీలావతి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్మికుల దీక్షలు

మదనపల్లె: మదనపల్లె మున్సిపల్ కార్యాలయం ఎదుట ఇంజినీరింగ్ విభాగం కార్మికులు చేపట్టిన నిరాహార దీక్షలు శుక్రవారానికి 24వ రోజుకు చేరాయి. ప్రభుత్వం తమ డిమాండ్లు తీర్చాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంజనీరింగ్ కార్మికులు 51 రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకోవడానికి ప్రభుత్వం సమయం లేదా అని ప్రశ్నించారు. న్యాయమైన సమస్యలను పరిష్కారించాలని దీక్షలు, నిరసనలు, సమ్మె చేస్తున్నా స్పందించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం, టెక్నికల్ కార్మికులకు రూ.29,200, నాన్ టెక్నికల్ కార్మికులకు రూ.24,500 వేతనం అడుగడం తప్పా అని ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించి పరిష్కారం చేసేదాక ఆందోళనలు, దీక్షలు విరమించేది లేదని పేర్కొన్నారు.

విధులలో ఒత్తిడిని అధిగమించాలి

మదనపల్లె రూరల్ : వైద్య సిబ్బంది విధులలో భాగంగా ఏర్పడే ఒత్తిడిని అధిగమించాలని జిల్లా అడిషనల్ డీఎం హెచ్‌ఓ రమేష్ బాబు, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి శివ ప్రతాప్, మానసిక వైద్యులు ఉదయ్ కుమార్, ఆర్ఎంఓ డాక్టర్ నవీన్ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా ఆస్పత్రిలోని డైక్ భవనంలో మదనపల్లె డివిజన్ లోని పీహెచ్సీలలో పనిచేస్తున్న వైద్య సిబ్బందికి ఒత్తిడి దూరం చేసుకోవడం ఎలా అనే అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా ఉన్న వైద్య సిబ్బంది ఒత్తిడిని అధిగమించి విధుల్లో రాణించాలన్నారు. పని ఒత్తిడి కారణంగా ఎదురయ్యే మానసిక సమస్యలు అనారోగ్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే ఒత్తిడిని తగ్గించుకునేందుకు యోగా సాధన మంచి ప్రత్యామ్నాయ మార్గం అన్నారు. కార్యక్రమంలో డీఈఐసీ వైద్యుడు నవీన్ కుమార్, సైకాలజిస్ట్ రాధిక, గౌతమి, స్నేహలత, వివిధ పీహెచ్సీల నుంచి వచ్చిన సూపర్వైజర్లు పాల్గొన్నారు.

హెలెన్‌కెల్లర్ ఎందరికో స్ఫూర్తి దాత

మదనపల్లె సిటీ: అంధులు, బధిరులు, మూగవారు, వికలాంగుల ఉద్యమాల సారధిగా ప్రపంచ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్న హెలెన్ కెల్లర్ ఎందరికో స్ఫూర్తి దాత అని వెలుగు ప్రత్యేక పాఠశాల కన్వీనర్ భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక అమ్మచెరువుమిట్టవద్దనున్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో హెలెన్‌కెల్లర్ డే నిర్వహించారు. తన జీవిత ప్రయాణానికి అవయవ లోపం అడ్డుకాదంటూ రచయితగా, సామాజిక కార్యకర్తగా, అధ్యాపకురాలిగా ఎదిగారన్నారు. కొంత మంది అవయవాలు లోపం ఉన్నాయని తీవ్ర నిరాశతో జీవితం గడిపేస్తారన్నారు.అదే సమయంలో ఆత్మస్థైర్యంతో ముందుకు నడవాలన్నారు. కార్యక్రమంలో వెలుగు ప్రిన్సిపాల్ లీనాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

పర్మినెంట్ ఉద్యోగాల పేరుతో వసూళ్లు

- కార్మిక సంఘ నాయకులపై దినసరి పారిశుద్ధ్య కార్మికుల ఫిర్యాదు
- విచారణకు ఆదేశించిన కమిషనర్

మదనపల్లె: సెలక్షన్ గ్రేడ్ మదనపల్లె మున్సిపాలిటిలో పనిచేస్తున్న దినసరి పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేయిస్తామని డబ్బు వసూలు చేశారన్న ఆరోపణలపై పూర్తిస్థాయిలో విచారణకు కమిషనర్ కే.ప్రమీల ఆదేశాలిచ్చారు. మున్సిపాలిటి పరిధిలో 80 మంది దినసరి పారిశుద్ధ్య కార్మికులు కోవిడ్ సమయం నుంచి విధులు నిర్వహిస్తున్నారు. వీరికి నెలకు రూ.15వేల వేతనం చెల్లిస్తుండగా గత జనవరి నుంచి వేతనాలు అందడం లేదు. పర్మినెంట్ లేదా కాంట్రాక్టు లేదా ఆప్కాస్ పరిధిలోని ఈ కార్మికులను పర్మినెంట్ ఉద్యోగుల తరహాలో ఆప్కాస్ కింద చేర్పించి ఉద్యోగ భద్రత కల్పిస్తామని కార్మిక సంఘాలకు చెందిన కొందరు నాయకులు నమ్మించారు. కార్మికుల అమాయకత్వాన్ని, ఆశను ఆసరాగా చేసుకున్న సంఘాల నేతలు వారి నుంచి భారీగా డబ్బు వసూలు చేశారు. డబ్బిచ్చాం కాబట్టి నాయకులు తమను శాశ్వతంగా పారిశుద్ధ్య కార్మికులుగా పని చేసుకునే అవకాశం కల్పిస్తారని ఆశలు పెట్టుకున్నారు. అయితే నెలల గడిచినా కార్మికులు ఆప్కాస్ పరిధిలోకి రాలేదు. అయినప్పటికి ఎదురు చూస్తూ వచ్చారు. అయితే గత ఐదు నెలలుగా జీతాలు అందకపోవడం, దీనికి సంబంధించిన వాస్తవాలు సాక్షిలో కథనాలుగా ప్రచురితం కావడంతో కార్మికులకు అసలు విషయం అర్థమైంది. కొన్ని రోజుల క్రితం కార్మికులు సమావేశమై చెల్లించిన డబ్బు విషయంగా చర్చించారు. తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వాలని తీసుకున్న వారిపై ఒత్తిడి తెచ్చారు. తర్వాత ఏమైందో కాని ఇద్దరు పారిశుద్ధ్య దినసరి కార్మికులు కమిషనర్ ప్రమీలను కలిసి తమను ఆప్కాస్ పరిధిలోకి చేరుస్తామంటూ రూ.40వేలు వసూలు చేశారని, దీనిపై చర్యలు తీసుకోవాలని లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కమిషనర్ విచారణకు ఆదేశించారు. దీనిపై ఆమె మాట్లాడుతూ ఇద్దరు కార్మికులు ఫిర్యాదు చేయగా విచారణ చేయిస్తున్నామని శుక్రవారం చెప్పారు.

అంగన్‌వాడీ చిన్నారులకు చేనేత బ్యాగులు



చిన్నారులకు బ్యాగులు పంపిణీ

కురబలకోట: రాష్ట్ర గ్రామీణ సాక్షరత ట్రస్టు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు బ్యాగులను అందజేస్తున్నట్లు చేనేత కార్మిక యూనియన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు గుంపు వెంకటేష్ తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం మండలంలోని చేనేతన గర్ అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు ఆ సంఘ నాయకులు శుక్రవారం బ్యాగులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు, చేనేత కార్మికులకు సేవా దృక్పథంతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. చేనేత కార్మికులకు సంక్షేమ పథకాల అమలుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జింకా వెంకటరమణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. రామ్మోహన్ సహకారం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తంబళ్లపల్లె అధ్యక్షులు అనంత ఈశ్వరయ్య, గుదిటి భాస్కర్, దొండ్ల నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణతో జీవాలు సురక్షితం



కురబలకోట: జీవాలకు నట్టల నివారణ మందు తాపుతున్న దృశ్యం

కురబలకోట: నట్టల నివారణ మందుతో గొర్రెలు, మేకలలో వ్యాధి నిరోధక శక్తి పెరిగి సురక్షితంగా ఉంటాయని పశు సంవర్ధక శాఖ మదనపల్లె డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ ఎన్. నీరజ అన్నారు. శుక్రవారం ఆమె అంగళ్లు ఏడీ శ్రీధర్ రెడ్డితో కలసి కనసానివారిపల్లె రైతు సేవా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం నార్లపల్లె, చేనేతనగర్, బ్రాహ్మణ ఒడ్డుపల్లె, కనసానివారిపల్లె గ్రామాల్లో జీవాలకు నట్టల నివారణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గొర్రెల, మేకల పెంపకందారులు విధిగా వాటికి నట్టల నివారణ మందును తాపించాలన్నారు. నులిపురుగులు చనిపోయి వాటి ఎదుగుదలకు దోహదపడుతుందన్నారు. వచ్చే నెల పది వరకు మందు పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. సిబ్బంది ధరిణి, నిర్మల, కార్తికేయ, రెడ్డిశేఖర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కలకడ: ప్రతి గొర్రె, మేకకు నట్టల నివారణ మందు తాపించాలని రాయచోటి డివిజన్ పశువైద్యసంచాలకులు డాక్టర్ మాలకొండయ్య ఆదేశించారు. శుక్రవారం మండలంలోని కలకడ పశువైద్యశాల పరిధిలోని కె.దొడ్డిపల్లె పంచాయతీ గోపాలపురం, ఎర్రకోటపల్లె పశువైద్యశాల పరిధిలోని దేవులపల్లె పంచాయతీ బొజ్జగుంటపల్లె గ్రామాలలో నిర్వహిస్తున్న నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు.

విద్యాసంస్థల్లో సీసీ కెమెరాల నిఘా తప్పనిసరి

మదనపల్లె డీఎస్పీ మహేంద్ర



మాట్లాడుతున్న డీఎస్పీ మహేంద్ర

మదనపల్లె రూరల్ : మదనపల్లె పోలీస్ సబ్ డివిజన్‌లో ప్రైవేటు పాఠశాలలు, కాలేజీలలో తప్పనిసరిగా సీసీ కెమెరాల నిఘవ్యవస్థ ఉంచాలని డీఎస్పీ మహేంద్ర అన్నారు. శుక్రవారం స్థానిక డీఎస్పీ కార్యాలయ ఆవరణలో పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలు కాలేజీల కరస్పాండెంట్లు, ప్రిన్సిపల్స్‌తో డీఎస్పీ సమావేశమయ్యారు. అంతర్జాతీయ యాంటీ డ్రగ్ డే ర్యాలీని విజయవంతం చేసినందుకు ప్రత్యేకంగా వారికి ధన్యవాదాలు తెలిపారు. కరస్పాండెంట్లు, ప్రిన్సిపల్ డీఎస్పీని సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కళాశాలలో కంప్లైంట్ బాక్సులు ఏర్పాటు చేయాలని, ఎలాంటి ర్యాగింగ్ జరగకుండా చూడాలన్నారు. పాఠశాల,కళాశాల యాజమాన్యాలు అప్రమత్తంగా ఉండాలని, ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల జరిగే దుష్పరిణామాలను విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐలు కళా వెంకటరమణ ఎరిషావలి, శ్రీ జ్ఞానాంబిక విద్యాసంస్థల కరస్పాండెంట్ గురు ప్రసాద్, ప్రైవేటు పాఠశాలల అన్నమయ్య జిల్లా అధ్యక్షులు రఘునాథ రెడ్డి, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాలకు రుణాలివ్వండి

– వెలుగు జిల్లా పీడీ సత్యనారాయణ



ఎస్‌హెచ్‌జీ రుణాల మంజూరుపై మాట్లాడుతున్న పీడీ సత్యనారాయణ

కలికిరి: మహిళ స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీ)లకు బ్యాంకర్లు విరివిగా రుణాలు మంజూరు చేయాలని వెలుగు జిల్లా ప్రాజెక్టు డైరెక్టరు సత్యనారాయణ బ్యాంకు మేనేజర్లను కోరారు. శుక్రవారం కలికిరిలో వివిధ బ్యాంక్ మేనేజర్లను కలిసి ఎస్‌హెచ్‌జీలకు రుణాలు గ్రౌండింగ్‌పై చర్చించారు. అంతకు మునుపు స్థానిక వెలుగు కార్యాలయంలో సంఘమిత్రలతో సమావేశమాయ్యరు. ఇకపై ఎస్‌హెచ్‌జీల మహిళలకు వీఓ ద్వారా కాకుండా శ్రీనిధి బ్యాంక్ ద్వారా వ్యక్తిగత రుణాలు ఇవ్వడం ఇవ్వడం, రికవరీలు ఆన్‌లైన్ చేయడానికి ప్రతి మూడు మండలాలకు ఒక శ్రీనిధి బ్యాంక్ మేనేజరును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కలికిరి, వాల్మీకిపురం, గుర్రంకొండ మండలాలకు మౌనికను మేనేజరుగా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. దీంతో సీసీల అక్రమాలకు తావుండదన్నారు. ఉన్నతి రుణాలకు సంబందించి రికవరీలో మండలం చాలా వెనుకబడి ఉందని, రికవరీపై దృష్టి సారించాలని ఆదేశించారు. మండలంలో మహిళ రైతులకు సంబంధించి ఎఫ్‌పీజీలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో డీపీఎంలు గంగార్జున, వేణుమాదవ్, ఏపీఎం(ఎఫ్‌పీఓ) రమేష్, ఏపీఎం దేవసేన, సీసీలు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

గ్రామ సర్వే ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సబ్ కలెక్టరేట్ డీఏఓ నిర్మలాదేవికి వినతిపత్రం అందిస్తున్న గ్రామ సర్వేయర్లు

మదనపల్లె రూరల్ : గ్రామ సర్వే ఉద్యోగులుగా ఐదేళ్లు సర్వీస్ పూర్తి చేసుకున్నప్పటికీ తమ సమస్యలను పరిష్కరించకపోగా, రేషనలైజేషన్, ట్రాన్స్‌ఫర్ ప్రక్రియలో గ్రామ సర్వేయర్లకు తీవ్ర నష్టం కలగజేస్తున్నారని విలేజ్ సర్వేయర్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ వ్యవస్థాపక అధ్యక్షులు మధుబాబు అన్నారు. గ్రామ సర్వే ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేంతవరకు పెన్‌డౌన్ చేస్తూ శాంతియుతంగా నిరసన తెలిపేందుకు నిర్ణయించుకున్నామని తెలుపుతూ మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని గ్రామ సర్వేయర్లు శుక్రవారం సబ్ కలెక్టరేట్ డీఏఓ నిర్మలాదేవికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.....భూ సర్వేయర్ల రేషనలైజేషన్..జనాభా ప్రాతిపదికన కాకుండా, రెవెన్యూ విలేజ్ విస్తీర్ణం మేరకు చేయాలన్నారు. సర్వేయర్లకు ప్రమోషన్ ఇచ్చి బదిలీలు చేయాలన్నారు. రేషనలైజేషన్ చేస్తున్న సర్వేయర్లను వారి సమ్మతితో కౌన్సిలింగ్ ప్రక్రియ నిర్వహించి, ఇతర డిపార్ట్‌మెంట్స్, వివిధ స్థానాలకు పంపే ముందు మహిళా ఉద్యోగుల సమ్మతితోనే పంపుతూ, వారికి స్పెషల్ అలవెన్సులు కల్పిస్తూ, ఒకే డిపార్ట్‌మెంట్ సర్వీస్ రూల్స్ మెయింటైన్ చేస్తూ వారికి పదోన్నతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్వేయర్లు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామ సర్వేయర్ల నిరసన

కురబలకోట: సొంత మండలంలో పోస్టింగ్ కోరుతూ మండలంలోని గ్రామ సర్వేయర్లు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. బదిలీలు, పదోన్నతులలో స్పష్టత లేకుండా పోయిందన్నారు. రాష్ట్ర అసోసియేషన్ పిలుపు మేరకు నిరసన వ్యక్తం చేసనట్లు తెలిపారు. సర్వేయర్ల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని వారు కోరారు. తహసీల్దారు ధనుంజయులు, ఎంపీడీఓ గంగయ్య, మండల సర్వేయర్ భువనేశ్వరికి ఈ సందర్భంగా వినతిపత్రం అందజేశారు.

అవగాహనతోనే మలేరియా నివారణ



మలేరియా వ్యాధులపై అవగాహన ర్యాలీ

మదనపల్లె రూరల్ : ప్రజలు సరైన అవగాహనతో ఉంటే మలేరియా నివారణ సాధ్యమవుతుందని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, మదనపల్లె సబ్ యూనిట్ అధికారి ఖలీలుల్లా ఖాన్ అన్నారు. శుక్రవారం మలేరియా మాసోత్సవాల సందర్భంగా మండలంలోని కోళ్ల బైలు పంచాయితీ బాబు కాలనీ, పట్టణంలోని దొంతివీధి, ఇందిరా నగర్ తదితర ప్రాంతాల్లో మలేరియా నివారణకు తీసుకోవలసిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...సమాజ భాగస్వామ్యం తోనే మలేరియా జ్వరాల నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. దోమ కాటుతో వ్యాప్తి చెందే వ్యాధులు మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడువాపు జ్వరాల నియంత్రణకై వైద్య ఆరోగ్య సిబ్బంది క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నరన్నారు. వ్యాధి లక్షణాలు నుబట్టి రక్తపరీక్షలు చేయించుకుని,సకాలంలో చికిత్స పొందితే ప్రాణాపాయం ఉండదన్నారు. అనంతరం నినాదాలు చేస్తూ ప్లకార్డులు బ్యానర్స్ ప్రదర్శన చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమం లో డాక్టర్ సల్మాన్ ఖాన్, హెల్త్ సూపర్‌వైజర్లు, సిహెచ్‌ఓ అనూష, ఏఎన్ఎంలు వీణ, లావణ్య, రాధా, హెల్త్ అసిస్టెంట్ గంగయ్య తదితరులు పాల్గొన్నారు.